మన భూమిలో సారం ఎక్కువ. అందుకే తరాలుగా మనం వ్యవసాయం మీద ఆధారపడ్డాం. రుతువుకు ఆ నేల స్పందించే తీరు కూడా అద్భుతం. కళ్ల ముందు కాన్వాస్ పరుచుకున్నట్టుగా ఇక్కడి గడ్డిపరకలు సహా పూలు, పళ్లు ... అన్ని రంగుల్లోనూ కనిపిస్తాయి. తన కళ్ల ముందు ఇన్ని అనుభవాలనీ, మార్పులనీ, సజీవమైన ప్రకృతినీ గమనిస్తున్న మనిషిలో తాత్వికత రాకుండా ఎలా ఉంటుంది. అగాధపు లోయలు, ఆకాశపు కొండలు, నదులూ, సంద్రాలూ తనకు జీవితాన్ని అన్నివైపులా పరిచయం చేస్తాయి. ప్రతి కాలానికీ తట్టుకునేలా శరీరం, ఆ కాలంలో దొరికే ఆహారం తనను పరిపూర్ణమైన మానవుడిలా మారుస్తుంది. ఆరు రుతువులూ అద్భుతాలే! ఆమని హాయిగొలిపితే, గ్రీష్మ తాపం వర్షరుతువుకు ఆలంబన అవుతుంది. శిశిరం ఆకురాల్చి వసంతానికై అర్రులుచాస్తుంది. ఇక శరత్తు మత్తులో ఉండగానే వచ్చే హేమంతం కొన్ని ప్రత్యేకతల సమాహారంగా కనిపిస్తుంది. ఆ విశేషాలే ఇవి..

ఇప్పుడంటే నాలుగు గోడల మధ్యా.. ఓ కంప్యూటర్ తెర ముందు మన జీవితం గడిచిపోతున్నది. తినాలంటే రుచి మాత్రమే ఉండి పోషకాలు ఏమాత్రం లేని తిండి, కాలం గడపాలంటే మొబైల్, కాలు కదపాలంటే బండి, కుటుంబంతో గడపాలంటే రిసార్ట్. చూస్తుండగానే వారాలు, నెలలు, ఏళ్లు గడిచిపోతున్నాయి. ఇక ఫలానా రుతువు అని గమనించుకునే సమయం ఏది. కార్తిక మాసంలో దీపాలు, సంక్రాంతి పిండివంటలు, దసరా పూజలు అన్నీ క్యాలెండర్ ప్రకారమే. కానీ ఆ క్యాలెండర్ పేజీల వెనకాల దాగిన రుతువులతో ఓసారి మమేకం అయితే... జీవం విలువ తెలుస్తుంది. దేనికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో అర్థం అవుతుంది. తాత్వికత అలవడుతుంది. అందుకే ఆధ్యాత్మికంగా, ఆరోగ్యపరంగా, అక్షరయానంగా హేమంతరుతువు మన జీవితంలో భాగమైన తీరును ఓసారి చూద్దాం!

### అక్షరహేమంతం!

మనిషికి తన భావాన్ని ప్రకటించే అవకాశం మొదలవడంతోనే తన చుట్టూ ఉన్న ప్రకృతిని వర్ణించాడు. అందులో హేమంతమూ ఉంది. వాల్మీకి నుంచి కాళిదాసు వరకూ అందరూ హేమంత సంతసాన్ని తలచుకున్నవారే. తెలుగునాట కూడా ఈ ప్రాభవం తక్కువేమీ కాదు. భాగవతం అంటే తెలుగువారికి గుర్తుకు వచ్చేది అక్షరాలు పోత పోసిన బమ్మెర పోతనే! అప్పటి సామాన్యులను సైతం ఆకట్టుకునేలా, అర్థమయ్యేలా సాగిన తన అనువాదం... భక్తిలోనే కాదు, తెలుగు సాహిత్యంలో కూడా ఓ విప్లవం! మంచిని చెప్పే ఉటంకింపులుగా, నోరు తిరిగేందుకు అభ్యాసంగా, అక్షరపు అందాన్ని చూపించే మాధుర్యంగా, భాష మీద పట్టు కలిగించే నేర్పుగా, దైవాన్ని తలుచుకునే ఆలంబనగా... పోతన భాగవతాన్ని ఎన్నివిధాలుగానో తెలుగు సమాజం అక్కున చేర్చుకుంది. పోతన కూడా భాగవతాన్ని కేవలం తెనుగీకరించలేదు.. ఇక్కడి జీవనశైలికి, సంస్కృతికి అనుగుణంగా మార్చేశారు. తను స్పృశించని అంశం లేదేమో. అందులో హేమంతమూ ఒకటి. పోతన భాగవతంలోని దశమ స్కంధంలో హేమంత వర్ణన స్పష్టంగా కనిపిస్తుంది. వీటిలో ఒక్కో పద్యం ఒక్కో అంశాన్ని విశదపరుస్తుది. ఒక రుతువును ఇన్ని రకాలుగా చూడవచ్చా అనిపించే భావనలివి.

- హేమంతములో ఉండే చలిని, జంటలన్నీ తమ కౌగిలింతలతో ఎదుర్కొంటున్నారట.



- చలికి ఎక్కడ చిక్కుతానో అని సూర్యుడు కూడా వేగంగా పరుగుతీస్తాడట. అందుకే చలికాలం రాత్రివేళలు ఎక్కువ.
- చలి దెబ్బకు తట్టుకోలేక త్రేతాగ్నులు అనే మూడు అగ్నులలో ఒకటి శివుని మూడో నేత్రంలో, ఇంకొకటి సాగరగర్భంలో, మరొకటి గృహస్థుల ఇళ్లలోకి చేరుకొని తమను తాము కాపాడుకున్నాయని అంటాడు.
- బ్రహ్మవిష్ణుమహేశ్వరులు... తమ శరీరాల్లోనే అర్ధాంగులను నిలుపుకోవడం వెనుక కారణం... హేమంతపు చలే అని చమత్కరిస్తారు.

పోతన మాత్రమే కాదు ఆ తర్వాతి కాలంలో వచ్చిన కవులు పింగళి సూరన నుంచి తెనాలి రామకృష్ణుడి వరకూ హేమంతపు చలిని తమ కావ్యాలలో వర్ణించారు. విశ్వనాథుడైతే కాళిదాసును అనుసరిస్తూ రుతుసంహారాన్ని రాశారు. కాళిదాసుది సంస్కృత కావ్యమైతే, విశ్వనాథునిది తెలుగు సంస్కృతి. తట్టలో వడువు, గుమ్మడిపూలు, గొబ్బిళ్లు, ముగ్గులు... ఇలా మన పల్లె జీవితం అంతా ఆయన వర్ణించిన హేమంతంలో కనిపిస్తుంది.

### హేమంతం ఓ దేవత అయితే!

ప్రకృతి రూపాలకు పేర్లు పెట్టడం, వాటికి వ్యక్తిత్వాన్ని ఆపాదించడం కొత్తేమీ కాదు. అలా హేమంతాన్ని కూడా ఓ వ్యక్తిలాగో, శక్తిలాగో భావించిన సందర్భాలు లేకపోలేదు. వేర్వేరు దేశాల్లోని జానపదులు హేమంతం చుట్టూ అల్లుకున్న నమ్మకాలు ఆసక్తికరంగా ఉంటాయి.

- ఐర్లండ్, స్కాట్లాండ్ దేశాల్లో కాలియా అనే దేవతను హేమంతానికి అధిదేవతగా భావిస్తారు. ఒక ముసలావిడ రూపంలో ఉండే ఈవిడ చేతిలో ఒక సుత్తి ఉంటుందనీ... దాంతో కొండల్ని చెక్కుతుందని నమ్ముతారు. తన చుట్టూ ఎన్నో గాథలు, ఆచారాలు అల్లుకుని కనిపిస్తాయి.
- క్రిస్మస్ శాంతాక్లాజ్‌ని పోలిన ఓ చిత్రమైన పాత్ర రష్యాలో ఉండే డెడ్ మొరోజ్. క్రైస్తవంతో పాటు ఎదిగిన ఈ పాత్రను హేమంతానికి చిహ్నంగా భావిస్తారు. శాంతాలాగే తను కూడా హేమంతంలో పిల్లలకు బహుమతులు అందిస్తాడు. రష్యన్ విప్లవం తర్వాత ఎగసిన భావజాలంతో, ఈ పాత్ర ధరించడానికి వీల్లేదంటూ నిషేధించారు కానీ, తర్వాత రోజుల్లో మళ్లీ కనిపించడమే కాదు... రష్యన్ సంస్కృతిలో ఓ భాగమైంది.
- హేమంతంలో చెట్ల ఆకులు రంగులు మార్చడం వెనుక, అద్దాల మీద సన్నటి చారికలు గీయడం వెనుకా ఓ అదృశ్య హస్తం ఉంటే... అది జాక్ ఫ్రాస్ట్ పనే అని ధృవ ప్రాంతవాసుల నమ్మకం.
- చైనాలోనూ ఓ హేమంత దేవత ఉంది. తన పేరు టెంగ్లు. తన చుట్టూ అల్లుకున్న పాటలు చైనా భాషా సంస్కృతులను తీవ్రంగా ప్రభావితం చేశాయని చెబుతారు.
- పర్షియాలో మిత్ర అనే దేవత జన్మించి, భూమికి అండగా నిలిచింది ఈ హేమంతంలోనే అని నమ్మకం.

### భక్తి మార్గశిరం

మార్గశిర, పుష్య మాసాలను హేమంత రుతువుగా పేర్కొంటాం. సుమారుగా ఇవి డిసెంబర్, జనవరి నెలలో వస్తాయి. మార్గశిరం అంటేనే చాలామందికి గీతలో కృష్ణుడు అన్న 'మాసానాం మార్గశీర్షోహం' అన్న మాట గుర్తుకొస్తుంది. అసలు గీతను బోధించిందే ఈ పవిత్ర మార్గశిరంలో అనే విశ్వాసంతో ఈ మాసంలో గీతాజయంతిని పాటిస్తారు. ఒకప్పుడు మార్గశిరంతో మొదలయ్యే హేమంతమే మనకు సంవత్సరాదిగా ఉండేది అనడానికి చాలా ప్రమాణాలు ఉన్నాయి. ఇప్పటికీ భక్తిపరులకు మార్గశిరం ఓ గొప్ప సందర్భమే. మార్గశిరం అన్న పేరులోనే ఉన్నతమైన మార్గం అనే అర్థం ధ్వనిస్తుంది. ఈ మాసంలో చలి ప్రభావం ఎలాగూ తెలిసిందే. దానికి తోడు మనసులో అలజడి రేపే చంద్రుని ప్రభావం కూడా అధికంగా ఉంటుందని చెబుతారు. ఈ పరిస్థితులు కలిగించే చిరాకులను, కుంగుబాటును ఎదుర్కొనేందుకు ఆలయ సందర్శన, భగవన్నామస్మరణ, పూజలు, వ్రతాలు ఉపయోగపడతాయని పెద్దల నమ్మకం. అందుకేనేమో మార్గశిరంలో ప్రతిరోజూ ఏదో ఒక పండుగ కనిపిస్తుంది. సుబ్రహ్మణ్య షష్ఠి, మిత్రసప్తమి, కాలభైరవాష్టమి, గోవత్స ద్వాదశి, దత్త జయంతి, ముక్కోటి ఏకాదశి... ఇలా అనుదినం ఏదో పర్వం పలకరిస్తుంది. ఇక మార్గశిరంలో ఉన్న వ్రతాలూ విశేషమే! హనుమద్వ్రతం, స్కంద వ్రతం, గురువార లక్ష్మి వ్రతం లాంటి సందర్భాలు కనిపిస్తాయి.

మార్గశిరంలో కనిపించే మరో విశేషం ఏమిటంటే ఇందులో ప్రతి దైవానికీ ప్రాధాన్యం కనిపిస్తుంది. నాగపూజ, దత్తాత్రేయుడు, కార్తికేయుడు, భైరవుడు, గణపతి, విష్ణుమూర్తి, లక్ష్మీదేవి... చివరికి యమ ధర్మరాజును కూడా ఈ మాసంలో కొలుస్తారు. చలి ఎక్కువగా ఉండే ఈ రోజులను యమదంష్ట్రలుగా భావిస్తూ, ఈ కాలం మృత్యుఘడియల్ని తరిమేసేందుకు ఆ సమవర్తిని కొలుచుకోవాలి అని సూచిస్తారు. మార్గశిరంలోనే కనుక సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశిస్తే... ధనుర్మాసమూ